సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 20.325 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 20.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,726
3 శాతం జీఎస్టీతో..	రూ.5,898
సవర (8 గ్రా)	రూ.47,184

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.0 /22.6
ఆదివారం గాలిలో తేమ 55 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సోమవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

టీఆర్‌ఆర్ కళాశాలలో రీసెర్చ్ సెంటర్

కందుకూరు రూరల్: కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో రీసెర్చ్ సెంటర్‌ను కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ తెలిపారు. ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్, ఇంగ్లిష్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్లలో రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేసి అందులో పనిచేస్తున్న డాక్టరేట్ అధ్యాపకులను రీసెర్చ్ గైడ్‌లుగా గుర్తించారని తెలిపారు. ఇటీవల ఇతర యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్ల బృందం కళాశాలను సందర్శించి డిపార్ట్‌మెంట్లలోని మౌలిక వసతులను పరిశీలించి ఆంధ్రకేసరి యూనివర్సిటీకి నివేదిక అందజేసిందన్నారు. రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటు ద్వారా పరిశోధనలు ఊపందుకుంటాయన్నారు.

వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వెండి బిస్కెట్, ఆభరణాలు

నెల్లూరు(క్రైమ్): ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ కె.భుజంగరావు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం పట్టణానికి చెందిన జి.సెంథిల్ తమిళనాడులోని ఓ నగల దుకాణంలో పనిచేస్తున్నాడు. సదరు దుకాణం నుంచి ఆర్డర్లపై సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల్లోని వ్యాపారులకు వెండి ఆభరణాలు సరఫరా చేయసాగాడు. ఈ నెల 17వ తేదీన అయన చెన్నై సెంట్రల్ సబర్బన్ రైలులో ఆభరణాలను తీసుకుని సూళ్లూరుపేటకు వచ్చారు. రైల్వేస్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఇన్‌చార్జి, గూడూరు రైల్వే ఎస్సై కె.కొండపనాయుడు తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో సెంథిల్ రైలు దిగి బయటకు వెళుతుండగా ఎస్సై అతనిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా, ఎలాంటి బిల్లులు లేకుండా 1.400 కేజీల సిల్వర్ బిస్కెట్, 2.200 కేజీల వెండి ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని ఆదివారం నెల్లూరు రైల్వే సీఐ తెలిపారు. వాటిని ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నామని ఆయన తెలిపారు.

యుద్ధభేరి సభ విజయవంతం



మాట్లాడుతున్న పందిటి సుబ్బయ్య

నెల్లూరు(వేదాయపాళెం): ఇటీవల నెల్లూరులో నిర్వహించిన మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేసేందుకు కృషి చేసిన మాదిగ ప్రజా సంఘాల నేతలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు సీమాంధ్ర ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య తెలిపారు. ఆదివారం నెల్లూరులో మాదిగ ప్రజా సంఘాల ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల అభ్యున్నతి కోసం సీమాంధ్ర ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. రాజకీయ ప్రాధాన్యం కోసం జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దేపూడి రవీంద్ర, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు రవి రాఘవేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, విజయకుమార్, శ్రీనివాసులు, మాతంగి కృష్ణ, ఉద్యోగుల సంఘం నేతలు రమణయ్య, గడ్డం శేఖర్ పాల్గొన్నారు.

చెంగాళమ్మకు స్వర్ణాభరణాలు



కాసుల హారం అందిస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సూళ్లూరుపేటకు చెందిన దాత సున్నం ఏడుకొండలు కుటుంబసభ్యులతో కలిసి 95 గ్రాముల బంగారు కాసుల హారం బహూకరించారు. ఈ బంగారు కాసుల హారాన్ని ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. అలాగే శ్రీసిటీలో పనిచేస్తున్న శంకర్ అనే దాత 7 గ్రాముల బంగారు తాళిబొట్లు రెండు, ఒక నల్లపూసల దండను అమ్మవారికి విరాళంగా అందించారు.

చదువుల గుడికి వైభవం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. సర్కారు బడులను మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తోంది. వందల కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇప్పటికే తొలి విడతలో 1000కి పైగా పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దింది. రెండో విడతలో మరో 1,300లకు పైగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేస్తోంది.

- జిల్లాలో తొలి విడతలో 1,160 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- రూ.231.40 కోట్లతో మౌలిక వసతులు
- రెండో విడతలో 1,248 పాఠశాలల్లో పనులు
- ఇప్పటి వరకు రూ.266 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- మార్చి లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు

సర్కారు బడుల్లో వడివడిగా నాడు–నేడు పనులు



నెల్లూరులోని కొండాయపాళెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో తీర్చిదిద్దిన తరగతి గది

నెల్లూరు(టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు 'మన బడి నాడు–నేడు' పేరుతో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇప్పటికే తొలి విడతలో రూ.231.40 కోట్లతో జిల్లాలోని 1,060 ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను కల్పించింది. రెండో విడతలో రూ.466.94 కోట్ల అంచనాలతో జిల్లాలో మొత్తం 1,380 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. నాడు–నేడుతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, వర్చువల్ బోధన, టోఫెల్‌లో శిక్షణ, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితర వాటిని ప్రభుత్వం అమలు చేస్తోంది. వీటితోపాటు అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద తదితర పథకాలను పేద విద్యార్థుల కోసం అమలు చేస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది.

రెండో విడతలో..

నాడు–నేడు కార్యక్రమం రెండో విడతలో భాగంగా జిల్లాలోని మొత్తం 1,380 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వీటిలో 865 ప్రాథమిక, 247 ఉన్నత, 136 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 108 అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక డైట్ కళాశాల, ఒక బీఈడీ కళాశాల ఉన్నాయి. ఆయా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు పనులు వేగంగా జరుగుతున్నాయి.

త్వరితగతిన పనులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 39 అంగన్‌వాడీ కేంద్రాల్లో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. మరో 69 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణాల్లో ఉన్నాయి. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 336 ప్రహరీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 34 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో 919 మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ణయించగా, ఇప్పటికే 225 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మొత్తం 412 వంట గదుల్లో 135 నిర్మించారు. అలాగే మేజర్, మైనర్ రిపేర్లలో భాగంగా తరగతి గది, మరుగుదొడ్లకు సంబంధించి 904 పాఠశాలల్లో 284 చోట్ల మరమ్మతులు పూర్తి చేశారు. మొత్తం 905 విద్యుదీకరణ పనుల్లో 470 పనులు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల్లో 352 అదనపు తరగతి గదుల్లో 80 నిర్మాణం పూర్తి చేశారు. ఇసుక, సిమెంట్, ఫ్యాన్లు, లైట్లు తదితర వాటిని రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తోంది.

అధునాతన వసతులు

ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా జిల్లాలోని సర్కారు బడుల్లో అదనపు తరగతి గదులు, మైనర్, మేజర్ మరమ్మతులు, ప్రహరీలు, కుర్చీలు, బెంచ్‌లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఫ్యాన్లు, లైట్లు, కిటికీలు, తలుపులు, ఆర్‌ఓ ప్లాంట్లు, టైల్స్‌తోపాటు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్, బాలుర, బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు తదితర వసతులను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే తొలి విడతలో జిల్లాలోని 1,060 పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించింది.

ఇప్పటికే రూ.266 కోట్లతో పనులు

జిల్లాలో నాడు–నేడు రెండో విడత పనులను రూ.466.94 కోట్ల అంచనాతో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు రూ.266 కోట్లు ఖర్చు చేసింది. నాడు–నేడు పనులు పారదర్శకంగా జరిగేలా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రెండో విడత నాడు–నేడు పనులను ఈ ఏడాది మార్చి లోపు పూర్తి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలో రెండో విడత నాడు–నేడు పనులు చకచకా జరుగుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



బోగోలులోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్



కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో అధునాతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

మార్చి లోపు పనులు పూర్తి చేస్తాం

రెండో విడత నాడు–నేడు పనులను మార్చి లోపు పూర్తి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. ఇప్పటికే 50 శాతం మేర పనులు పూర్తి చేశాం. నాడు–నేడు పనులను పారదర్శకంగా నిర్వహించేలా క్షేత్రస్థాయిలో ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా పనులను పూర్తి చేస్తాం.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్ర శిక్ష

గతంలో కన్నా మిన్నగా అభివృద్ధి చేస్తున్నాం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: తాను ఏ ప్రాంతం నుంచి ప్రజాప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించినా ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశామని, గతంలో కన్నా మిన్నగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని తన నివాసంలో ఆదివారం నెల్లూరులోని 21, 22 డివిజన్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎంపీ ఆదాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, అన్నివర్గాల వారికి అందించిన సంక్షేమాన్ని ప్రజలు ఏ మాత్రం మరువరన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిన ప్రయోజనాలను వివరించాల్సిన అవసరం నాయకులపై ఉందన్నారు. సమావేశంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజని సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వాకర్స్ అసోసియేషన్ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్‌ను నిర్వాహకులు ఆదివారం ప్రారంభించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఉన్న వెలమ సంఘం ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో అధ్యక్షుడిగా డీవీ సుబ్బరాజు, కార్యదర్శిగా స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారిగా జయదేవ్‌లతో వాకర్స్ ఇంటర్నేషనల్ ఐఎంఎం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముదిరెడ్డి వెంకటాద్రిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్–2022 ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.రవిచంద్ర, ఎం.హరిరావు, ఎస్ఎం బాషా, కొండారెడ్డి, కమిటీ మెంబర్లుగా రాజా రమేష్, ఎ.చంద్రమౌళి, జి.వెంకటరావు, డి.మల్లికార్జున్, ఎస్.నాగేశ్వరరావు, సీహెచ్ ప్రభాకర్, శ్రీమన్నారాయణ, హుస్సేన్, జావీద్ ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు

ఘనంగా జమున స్మారక నానీల పురస్కార సభ



విభిన్న శ్వాసలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జమున స్మారక జాతీయ స్థాయి నానీల పురస్కార సభ, డాక్టర్ జయప్రద నవలా పురస్కార సభ ఘనంగా నిర్వహించారు. పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెళ్లకూరు జయప్రద రచించిన 'విభిన్న శ్వాసలు' కవితా సంపుటిని ప్రముఖ రచయిత్రి మెహజబీన్ ఆవిష్కరించారు. సభాధ్యక్షులు, పద్య కళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది డాక్టర్ జయప్రద నానీల సంపుటికి, నవలలకు పురస్కారాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ సాహితీ ప్రక్రియలో నానీలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నానీల పురస్కారాన్ని 'నానీల తీరాన' రచయిత్రి ఎస్.లహరి (హైదరాబాద్)కి, డాక్టర్ జయప్రద నవలా పురస్కారాన్ని 'వొలికిల బీడు' రచయిత వీఆర్ రాసానికి అందజేశారు. నానీల తీరాన సంపుటిని శ్రీధర్‌బాబు, వొలికిల బీడు నవలను 'పెరసం' గౌరవాధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, విభిన్న శ్వాసలు నవలను అడువాల సుజాత సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటికాపరుల జీవితాలను వొలికిల బీడు వివరిస్తోందని, భిన్నమైన మానవ స్వభావాలను విభిన్న శ్వాసలు తెలియజేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను సత్కరించడంతోపాటు నానీల పోటీల్లో పాల్గొన్న ముక్తాల నరేంద్ర, తిప్పావఝు నరసింహమూర్తి, దుప్పటి రమేష్‌లకు ప్రోత్సాహక నగదు బహుమతు అందజేశారు. కవులు, రచయితలు మద్దూరి శ్రీనివాసులు, కోసూరు రత్నం, చిన్ని నారాయణరావులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో మోపూరు పెంచల నరసింహం, టి.సులోచన, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- పండ్ల తోటల విస్తీర్ణం పెంచేలా రాయితీలు
- నిమ్మ, మామిడి, బొప్పాయి సాగుకు ప్రోత్సాహకాలు
- ఉద్యాన సాగులో యాంత్రీకరణకు సబ్సిడీలు
- నీటి కుంటలు, పాలీహౌస్‌ల నిర్మాణానికి సహకారం
- సమీకృత ఉద్యాన మిషన్ ద్వారా రైతులకు ఉపయోగం



పొదలకూరు ప్రాంతంలో పాలీహౌస్‌లో పూల మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి (ఫైల్)

పొదలకూరు: జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లావ్యాప్తంగా పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రాయితీలను అందజేస్తోంది. ప్రధానంగా జిల్లాలో 70 శాతం మంది రైతులు వరి సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం జిల్లాలో ఉద్యాన పంటలు సుమారు 50 వేల ఎకరాల్లో సాగవుతుండగా, ఈ విస్తీర్ణాన్ని 70 వేల ఎకరాలకు పెంచేందుకు ఉద్యాన శాఖ కసరత్తు చేస్తోంది. అందుకోసం రాయితీలను అందిస్తోంది. నిమ్మ, మామిడి, కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతున్నా మిగిలిన పండ్ల తోటల సాగు ఇంకా పెరగాల్సి ఉంది. సమీకృత ఉద్యాన మిషన్(ఎంఐడీహెచ్) ద్వారా ప్రభుత్వం రైతులకు రాయితీలను అందజేస్తూ యాంత్రీకరణను ప్రోత్సహిస్తోంది. పూల తోటల సాగు కోసం పాలీహౌస్‌ల నిర్మాణానికి రూ.లక్షల్లో రాయితీలను అందజేస్తున్నా రైతులు ఆశించిన స్థాయిలో ముందుకురావడం లేదు. దీనిపై ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు.

యాంత్రీకరణకు రాయితీలు

ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణకు రాయితీలు కూడా అందిస్తోంది. ఈ పథకం ద్వారా మినీ ట్రాక్టర్‌కు రూ.75 వేలు, పవర్ ట్రిల్లర్‌కు రూ.4 వేలు, తైవాన్ స్ప్రేయర్‌కు రూ.4 వేలు, మొబైల్ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.10 లక్షలు, కమ్యూనిటీ నీటికుంటకు రూ.20 లక్షలు, నీటికుంటకు రూ.75 వేలు, పాలీహౌస్‌కు రూ.2 లక్షలు, కోల్డ్‌రూమ్స్‌కు రూ.5.25 లక్షలు, షేడ్‌నెట్(4,000 స్క్వేయర్ మీటర్స్) రూ.35.5 లక్షలు అందజేస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది.

ప్రభుత్వ రాయితీలు

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. ఈ రాయితీలను మూడు విడతలుగా పంపిణీ చేసి రైతులకు పండ్ల తోటల సాగుపై ఆసక్తి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. అంతేకాక పండ్ల తోటల సాగు ద్వారా అధిక దిగుబడులను సాధించేందుకు హెక్టారు విస్తీర్ణంలో మామిడి సాగుకు రూ.13,300, నిమ్మ, బత్తాయి సాగుకు రూ.16,004, టీసీ అరటి సాగుకు రూ.1,33,199, బొప్పాయికి రూ.24,663, జామ సాగుకు రూ.29,335 అందజేస్తోంది. హెక్టార్ విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రూ.40,000, ఉసిరి, నేరేడు, చింత సాగుకు రూ.18,000, హైబ్రీడ్ కూరగాయల సాగుకు రూ.20,000, ఆయిల్‌ఫామ్‌కు రూ.29,000, ఆయిల్‌ఫాంలో అంతర పంటల సాగుకు రూ.21,000, ఆయిల్‌ఫాం ఎరువులకు రూ.21,000 ప్రభుత్వం అందజేస్తోంది. హెక్టార్‌లో పూల సాగుకు రూ.16,000, మల్చింగ్ ఏర్పాటుకు రూ.16,000 అందిస్తోంది. మల్లె, చామంతి, కనకాంబరం, బంతి, లిల్లీ పూల సాగుకు కూడా ప్రభుత్వం రాయితీలను అందజేస్తోంది. సన్న, చిన్నకారు రైతులు పెట్టే మొత్తం ఖర్చులో 40 శాతం, ఇతర రైతులకు 25 శాతం హెక్టార్‌కు అందజేస్తోంది. రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ శాశ్వత పందిళ్లపై కూరగాయల సాగుకు హెక్టార్‌కు రూ.2.50 లక్షలను ప్రభుత్వం అందిస్తోంది.

జిల్లాలో..

ఉద్యాన పంటల విస్తీర్ణం
సుమారు 50 వేల ఎకరాలు

పంటల రకాలు
నిమ్మ, మామిడి, బత్తాయి, ఇతర పండ్లు, పూలు, కూరగాయలు



రైతు పొలంలో రాయితీపై ఏర్పాటు చేసిన నీటి కుంట (ఫైల్)

ప్రోత్సాహం భేష్



ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందించే ప్రోత్సాహకాలు బేషుగా ఉన్నాయి. రైతులు అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. కూరగాయల సాగు కోసం ప్రభుత్వం నాకు సబ్సిడీ అందజేసింది.

– జి.జయరామిరెడ్డి, రైతు, పొదలకూరు

ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది



ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రాయితీలను అందజేస్తోంది. ప్రధానంగా పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. పొదలకూరు ప్రాంతంలో బొప్పాయి సాగును ప్రోత్సహిస్తున్నాం. రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఇ.ఆనంద్, ఉద్యాన అధికారి, పొదలకూరు

53 మద్యం బాటిళ్ల స్వాధీనం

ఉదయగిరి: ఉదయగిరి సెబ్ కార్యాలయం పరిధిలోని మర్రిపాడులో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం రాత్రి దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయగిరి సెబ్ కార్యాలయంలో సీఐ ఆర్ వెంకటరమణమ్మ, ఎస్సై మల్లికార్జున అక్రమ మద్యం కేసు వివరాలు వెల్లడించారు. ఉదయగిరి సెబ్ పరిధిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారని ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో కన్నెలూరి సిద్దయ్య వద్ద 31, కన్నెలూరి వేమయ్య వద్ద 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సెబ్ సిబ్బంది వెంకటేశ్వర్లు, కోటి, సుబ్బయ్య పాల్గొన్నారు.

జగనన్నకు మరో అవకాశం కల్పిద్దాం



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రభుత్వ పథకాలు కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లో సమష్టిగా వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగన్‌మోహన్‌రెడ్డికి సీఎంగా మరో అవకాశం కల్పిద్దామని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుర్గంపల్లెలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అన్నింటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ప్రతి ప్రభుత్వ పథకంలో మహిళలను భాగస్వాములను చేసి వారికి అండగా నిలిచి మన్ననలు పొందుతున్నారన్నారు. జగనన్న పాలనలో ప్రతి గ్రామంలో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో ఓటేయాలని ప్రజలను కోరారు. ఓటు వేసే విషయంలో పొరబడితే మనం చాలా ఇబ్బందులు పడతామన్నారు. ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేయాలన్నారు. పార్టీ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ జీ ఓబుల్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, నాయకులు అశోక్‌కుమార్, యస్దాని, అక్కుల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 146
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 256
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 136

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.73
సన్నవి	: రూ.56
పండ్లు	: రూ.23